# ప్రతిమ నవ్వు

మనకు చేతకాని పని ఎదుటివారు చేయగలిగితే మనకు వారి పట్ల ఆకర్షణ కలగవచ్చు. అసూయ ఉండవచ్చు. లేదా రెండూ సమపాళ్ళలో ఉండవచ్చు. నాకు ప్రతిమ పట్ల ఏ భావాలున్నాయో చెప్పలేను. కానీ ఆమె అంటే నాకు ఇష్టం. అలాని ఇది ఏ ప్రేమ కథో అనుకునేరు. ప్రతిమకు పెళ్ళయింది. ఆమె పూర్తి పేరు ప్రతిమా గుప్తా. నాకూ పెళ్ళయింది. నాకు మల్లేనే నా భార్యక్కూడా ప్రతిమ అంటే ఇష్టం.

ప్రతిమ మరీ అంత అందమైనది కాదు. కానీ ఆమె ముఖంలో ఎప్పుడూ వెలుగుతూండే చిరునవ్వు ఆమెకొక వింత అందాన్ని ఆపాదిస్తుంది. ప్రతిమకు నవ్వు ఎక్కువ. ఈ ప్రపంచంలో జరిగే ప్రతి చిన్న విషయానికీ ఆమె విరగబడి నవ్వుతూంటుంది. అది మంచి కావచ్చు, చెడ్డ కావచ్చు. అన్ని విశేషాలూ ఆమెకు నవ్వును తెప్పిస్తాయి.

నవ్వన్నా, నవ్వేవాళ్ళన్నా నాకు చాలా యిష్టం. అదేం దురదృష్టమో దేనికీ నేనంత సులువుగా నవ్వలేను. ఏ విషయాన్నీ తేలికగా తీసుకోలేకపోవడం అందుక్కారణమని నా గురించి చెప్పే నా భార్య కూడా దేనికీ అంత సులువుగా నవ్వలేదు. అంతగా నవ్వలేని మా ఇద్దరికీ అన్నింటికీ నవ్వే ప్రతిమ అంటే ఇష్టముండడంలో ఆశ్చర్యంలేదేమో!

ప్రతిమ ఉత్తరాది మనిషి. ఆమెకు హిందీ తప్ప మిగతా భాష రాదు. ఇతర భాషలు నేర్చుకోవాలన్న కుతూహలం లేదు. మేము తెలుగులో మాట్లాడుతూంటే ఆమె అదే పనిగా నవ్వుతుంది. మొదట్లో ఆమె మమ్మల్ని కించ పరిచేదని భావించాము. కానీ తర్వాత తర్వాత ఆమె గురించిన నిజం తెలిసింది.

ప్రతిమ వంట బాగుండదట. ఆ విషయాన్నామె గర్వంగా చెప్పుకుంటుంది, తన వంటకు ఎప్పుడెప్పుడు ఎవరెవ్వరు ఎలా హడలిపోయారో ప్రతిమ నవ్వుతూ చెబితే నేను ఆశ్చర్యంగా విన్నాను. అవన్నీ చెప్పేక ఆమె మాకు చల్లని పానీయం ఇచ్చింది. ఎలా చేసిందో తెలియదు కానీ ఆ పానీయం మహా భయంకరంగా ఉంది. నా ముఖం చూస్తూ నే, "ఏదో మర్యాదకని ఇచ్చి ఇలా బాధపెడుతూంటాను. మొహమాట పడి మీ నాలుక అబద్ధం చెప్పవచ్చునేమో కానీ మీ ముఖం అబద్ధం చెప్పదు" అంటూ పగలబడి నవ్వింది. నేనూ నవ్వేశాను.

ఆ తర్వాత ఇంటికి వెళ్ళేక శ్రీమతితో, "నువ్వు కూడా ప్రతిమలా స్పోర్టివ్‌గా ఉండడం నేర్చుకోవాలి. నీకూ వంట అంత బాగా రాదు. ఎప్పుడైనా ఏదైనా పాడు చేస్తే ఉన్నమాట అన్నందుకు నా మీద అలగడం ఇకమీదటైనా మానేయి..." అన్నాను.

"అలాగే మానేస్తాను. కానీ వంట్లో బాగోలేకపోయినప్పుడు ప్రతిమ ఇంట్లో లాగే మనింట్లో కూడా మీరు నవ్వడం అలవాటు చేసుకోవాలి..." అంది శ్రీమతి.

ఈ బేరంలో ఎక్కువ నష్టపోయేది నేనేనని నాకు తెలుసు. ఎందుకంటే శ్రీమతి వంటలు నాకు రుచించవు.

ప్రతిమ అత్తగారు రోజూ ఎందుకో ఒకందుకు దెబ్బలాడుతూనే ఉంటుంది. ఆవిడ కంఠం పెద్దది కూడా. ఆవిడ మాటలు ఒకో పర్యాయం మాక్కూడా వినిపిస్తూంటాయి. ప్రతిమ ఆ మాటలకు చలించదు సరికదా ఆమె ముఖంలో నవ్వు కూడా చెదరదు. ఎప్పుడైనా శ్రీమతి ఆ విషయం ప్రతిమను అడిగితే, "ఆవిడ తిడుతున్నట్లే నాకు అనిపించదు. ఆవిడ నన్ను తిట్టడానికి కారణాలుండవు. కారణం లేకుండా ఎవర్నీ తిట్టడం నాకు చేతకాదు. ఆవిడ అలా తిట్టగలుగుతున్నందుకు నాకు నవ్వొస్తుంది. నేను నవ్వుతున్నా వినకుండా ఆవిడ తిడుతూంటే నా నవ్వు పెరిగిపోతుంది" అని ఆ విషయం తలుచుకుని అప్పుడు మళ్ళీ నవ్వేస్తుంది.

తనలోని లోపాలకు నవ్వుతుంది. తనను ఎవరైనా తిట్టినా నవ్వుతుంది. మరి తనకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే?

నా సందేహానికి సమాధానమా అన్నట్లు ప్రతిమ ఒకరోజు ఇంట్లో జారిపడింది. మనిషి ఒక్క పిసరు భారీగా ఉంటుందేమో కాస్త పెద్ద దెబ్బే తగిలింది. ఎక్కడో ఎముక సన్నగా బీటగిసిందని కూడా అన్నారు. ప్రతిమ హాస్పిటల్లో చేరింది. ఆమె కాలికి బ్యాండేజీ వేశారు. మేము చూడ్డానికి వెళ్ళాం. ఎందుకైనా మంచిదని ముఖాలు కాస్త దీనంగా పెట్టుకుని వెళ్ళాం.

మమ్మల్ని నవ్వుతూ పలకరించింది ప్రతిమ. మంచం మీంచి లేవలేకపోతున్నానని చెప్పి విరగబడి నవ్విందామె. ఒకవేళ తను శాశ్వతంగా కుంటిదైపోతే చంకలో కర్రలు పెట్టుకుని నడవదట. చక్రాల కుర్చీ కొనుక్కుంటుందిట..''మా ఆయన నా కాలు పోకూడదని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు. కరెంటుతో నడిచే చక్రాల కుర్చీ చాలా ఖరీదుట. అందుకని!'' అందామె నవ్వుతూ.

ఆమె నవ్వు చూస్తుంటే ఒకోసారి మరీ అతిగా కనిపించి వెకిలితనమేమో అనిపిస్తుంది. కానీ ఆమె మనసు చాలా మంచిది. ఎప్పుడు ఎవరికి అవసరమైనా ఆమె సాయపడుతుంది. ఎవరి మాటల్లోనూ ఆమెకు అపార్థాలు తోచవు.

ప్రతిమ హాస్పిటల్ నుంచి త్వరగానే ఇల్లు చేరింది. ఆమె కాలుకు ఏమీ కాలేదు. నిక్షేపంలా ఉంది. కానీ ఆ తర్వాత నెల రోజులకు ఆమె భర్త గుప్తాకు స్కూటర్ యాక్సిడెంటయింది. అది మరీ అంత ప్రమాదకరమైనది కాదు గానీ అతను వారం రోజులు మంచం మీద ఉండవలసి వచ్చింది. మేము వెళ్ళి చూసి వచ్చాం.

గుప్తా చాలా దీనంగా ఉన్నాడు. మళ్ళీ స్కూటర్ ఎక్కకూడదన్న నిర్ణయానికి కూడా వచ్చానని చెప్పాడు. అంతవరకూ స్కూటర్ కొననందుకు నన్నతను అభినందించాడు కూడా. దేవుడు కనుక తనను కాపాడక పోతే ఆ యాక్సిడెంటు నుంచి ప్రాణాలతో బయటపడవలసిన వాడు కాదుట. అక్కడ మేమున్నంతసేపూ ప్రతిమ కూడా చాలా సీరియస్‌గా నిలబడింది. ఆమె ముఖంలో ఎక్కడా నవ్వు లేదు. ఇన్నాళ్ళకు ఆమెలో వచ్చిన మార్పు నాక్కాస్త సంతోషాన్ని కూడా కలగజేసింది. అంటే నేను మనసులో ఏ మూలో ఆమె గురించి అసూయ పడుతున్నానన్నమాట!

మేము బయటకు రాగానే ప్రతిమ కూడా మాతో పాటు బయటకు వచ్చింది. చిన్న పని ఉందని మా ఇంటికి వచ్చింది. అక్కడికి వచ్చేక అదే పనిగా నవ్వడం మొదలు పెట్టింది. నేను ఆశ్చర్యపడ్డాను.

గుప్తా పిరికివాడే కాక ఉడుకుమోతు కూడానట. ఇంట్లో తన నవ్వును అదుపు చేయలేక నానా అవస్థపడుతున్నదట. గుప్తా తన యాక్సిడెంటు ఎలా జరిగిందని చెబుతాడో, తన బాధలనెలా వర్ణిస్తాడో ఎవరైనా తనను చూడడానికి రాగానే ముఖం ఎలా పెడతాడో, స్కూటర్ గురించి ఏమేం నిర్ణయాలు తీసుకున్నట్లు చెబుతాడో, ఆ సమయంలో తను ముఖంలో గాంభీర్యాన్నెలా ప్రదర్శిస్తుందో అన్నీ ఆమె వర్ణించి, నటించి చెబుతూంటే నాకు నవ్వాగలేదు. అందరి వద్దా చనువుగా ఉండడమూ, తెలిసినవారందరినీ అన్నగారూ అంటూ పలకరించి ఆప్యాయంగా మాట్లాడడమూ ఆమె విషయంలో క్రొత్త కాకపోయినా ఆనాటి ప్రదర్శన ఒక జీవితకాలం పాటు మరిచిపోలేను. ఆమె వెళ్ళిపోయాక శ్రీమతి మాత్రం ..''మొగుడికి దెబ్బ తగిలితే నవ్వే ఆడ మనిషినీవిణ్నే చూశాను...'' అంది.

ప్రతిమను మెచ్చుకోవాలనుకుని మానేశాను. నాకు దెబ్బలు తగిలితే శ్రీమతి నవ్వితే సహించగలనా అని ఆలోచించుకుంటే అంత మంచి సమాధానం రాలేదు.

శ్రీమతి ప్రతిమ గురించి ఇంకా చాలా చెప్పింది. ఆమెకు ఇద్దరాడపిల్లలు. వాళ్ళింట్లో

ఎంత అల్లరి చేసినా నవ్వుతుందిట. ఒకోసారి ఆమె నవ్వు తనకి చిరాకు తెప్పిస్తుందని కూడా అంది.

అయితే ప్రతిమ నవ్వును ఒక్క విషయంలో నేనూ శ్రీమతీ కూడా ఆనందించలేకపోయాం. ప్రతిమ పిల్లల వయసు వాళ్ళే మాకూ ఇద్దరు పిల్లలున్నారు.ప్రతిమ పిల్లలిద్దరూ ఆడపిల్లలయితే మా వాళ్ళలో ఒకరు అమ్మాయి, ఇంకొకరు అబ్బాయి. మా వాళ్ళు కాస్త బలహీనులు. ఆడినంతసేపూ ఆడి ప్రతిమ పిల్లలు ఆఖరున మా వాళ్ళను చావబాదేస్తుంటారు. ఆ దృశ్యం మాకు హృదయవిదారకంగా ఉంటుంది. అయితే ప్రతిమ తన పిల్లలను ఏ మాత్రమూ వారించదు సరిగదా గుక్కపట్టి నవ్వేస్తుంది. ఆవిడ అలా నవ్వుతున్నప్పుడు ఏం చేయాలో తెలియక నిస్సహాయంగా ఊరుకునేవాళ్ళం. కానీ శ్రీమతి - ప్రతిమ పిల్లలను చాటుగా హెచ్చరిస్తూండేది. అయితే ఆ పిల్లలకేం తెలుస్తుంది? ఆడుకునేటప్పుడు బాగానే మంచి ఉద్దేశ్యంతోనే ఉంటారు. మధ్యలో ఉడుకుమోత్తనం వస్తుంది.

ఒకసారి ప్రతిమ మాటల సందర్భంలో అంది కూడా..."మా పిల్లలకు ఆయన పోలికే వచ్చేసింది. ఆటల్లో ఓడిపోయి ఉడికిపోయి మిగతా పిల్లల్ని కొట్టేస్తారు. ఓడిపోవడంలోనూ, ఉడికిపోవడంలోనూ కూడా ఆయన పోలికే!" అనేసి అదేపనిగా విరగబడి నవ్వేసింది. ఆ నవ్వు మాకంత ఆనందాన్నివ్వలేదు. ఎందుకంటే వాళ్ళ పిల్లల చేతుల్లో తరచుగా దెబ్బలు తినేవాళ్ళలో మాపిల్లలూ ఉన్నారు మరి!

ఒకసారి మా ఇంటికి ఎవరో రాగా వాళ్ళకు ప్రతిమ గురించి చెప్పాం. వాళ్ళామెను చూడాలని కుతూహలపడ్డారు. మాకు పై ఇల్లే కాబట్టి గుప్తా కుటుంబాన్ని పిల్చుకువచ్చాం. అందరూ చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. చాలా సేపు సరదాగా గడిచిపోయింది.

నేను కబుర్లలో ఉండగా మా అబ్బాయి వచ్చి... పిల్లలు కొట్టుకుంటున్నారని చెప్పేడు. అందరం వెళ్ళాం. మా ఇంటికొచ్చిన కుర్రాడు ప్రతిమ కూతుర్ని ఎడాపెడా బాదేస్తున్నాడు. నేనూ, శ్రీమతి ప్రతిమ వైపు చూశాం.

ఆమె నవ్వడం లేదు. ఆమె కళ్ళలోంచి అశ్రుబిందువులు రాలాయి.

"అదే ఏదో చేసి ఉంటుంది.." అన్నాడు గుప్తా.

చటుక్కున కూతురి దగ్గరికి వెళ్ళి, "పిచ్చిపిల్ల.. ఎప్పుడూ ఒకర్ని కొట్టడమే కానీ దెబ్బ తిని ఎరుగదు" అంది ప్రతిమ.

భర్త అనారోగ్యాన్ని తేలికగా తీసుకుని హాస్యాన్ని సృష్టించుకుని ఆనందించగల ప్రతిమ - తన కూతురు పది మందినీ కొడుతూంటే చూసి ఆనందించగల ప్రతిమ - తన కూతురు కొన్ని సామాన్యమైన దెబ్బలు తింటే సహించి స్పోర్టివ్‌గా తీసుకోలేకపోయింది.

తల్లి ప్రేమకు నిర్వచనం ఇదేనా? తల్లి ప్రేమ అంటే స్వార్థానికి మరో పేరా?

ఈ సృష్టి చక్రాన్ని నడిపిస్తున్నది స్వార్థమని ఒప్పుకోక తప్పదు. ఆ స్వార్థానికున్న పలురకాల్లో మనం పరమోత్కృష్టమైనదిగా భావించే తల్లి ప్రేమ కూడా ఒకటి అనుకుంటాను.

★

*(నివేదిత మాస పత్రిక - జనవరి, 1979)*